Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply



Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply



శనివారం 24-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 228 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


## బైక్ ట్యాక్సీలపై నిషేధం ఎత్తివేత.. కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులు



2 లో

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ కలకలం



2 లో

## జిల్లాలో తీవ్ర విషాదం.. కుటుంబం ఆత్మహత్య ?


2 లో

## ఎగిరిపోయిన రూ.80వేల చిలుక.. కోనసీమలో యజమాని ఆవేదన


2 లో

## జనగణన జీవో జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం


2 లో

## పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు.. రంగంలోకి దిగిన డాగ్, బాంబ్ స్క్వాడ్



2 లో

## హుబ్బళ్లిలో భారీ అగ్నిప్రమాదం .. సుఖసాగర్ మెట్రో మాల్‌లో చెలరేగిన మంటలు


2 లో


# జైల్లో చిగురించిన ప్రేమ.. పెళ్లికి ఎమర్జెన్సీ పెరోల్


2 లో

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): వాళ్లిద్దరూ హత్యకేసుల్లో దోషులు. ఆమె డేటింగ్ యాప్ లో పరిచయమైన వ్యక్తిని హత్యచేసి జైలుకెళ్లింది. అతను ఏకంగా ఐదుగురిని చంపి శిక్ష అనుభవిస్తున్నాడు. వీరిద్దరి మధ్య జైల్లోనే ప్రేమ చిగురించింది. అది పెళ్లికి దారితీసింది. ఇంకేముంది పెళ్లి చేసుకునేందుకు పెరోల్ ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. వారి పెరోల్ పిటిషన్ ను పరిశీలించిన రాజస్థాన్ హైకోర్టు ఎమర్జెన్సీ పెరోల్ మంజూరు చేసింది. ప్రియాసేథ్ అలియాస్ నేహా సేథ్ - హనుమాన్ ప్రసాద్ నేడు అల్వార్ జిల్లా బరోడామేవ్ లో పెళ్లి చేసుకోనున్నారు. ఖైదీల మధ్య చిగురించిన ప్రేమ పెళ్లికి దారితీయడం, అందుకు కోర్టు ఎమర్జెన్సీ పెరోల్ ఇవ్వడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ప్రియా సేథ్ అలియాస్ నేహా సేథ్ వృత్తిరీత్యా మోడల్. ఆమెకు టిండర్ అనే డేటింగ్ యాప్ ద్వారా 2018లో దుష్యంత్ శర్మ అనే యువకుడు పరిచయం అయ్యాడు. అతడిని తన ప్రేమలోకి దింపి, ఆపై కిడ్నాప్ చేసి, డబ్బులు వసూలు చేసి అప్పట్లో తన ప్రియుడైన దిక్షాంత్ కాంబ్రా అప్పుల్ని తీర్చాలని ప్లాన్ చేసింది.

# చీలిపోతున్న ఆఫ్రికా.. 50 లక్షల ఏండ్లలో కొత్త మహా సముద్రం


2 లో

న్యూస్ డెస్క్ 23 జనవరి (ఇది కద నిజం ): ప్రపంచ పటాన్ని శాశ్వతంగా మార్చివేసేలా ఆఫ్రికా ఖండం చీలిపోతున్నది. తూర్పు ఆఫ్రికాలో భౌగోళిక మార్పులు వేగంగా సంభవిస్తున్నాయి. టెక్టానిక్ ప్లేట్ల (భూమి ఫలకాల) కదలికల వల్ల ఆఫ్రికా ఖండం చీలిపోయి అక్కడ కొత్తగా మరో మహా సముద్రం ఏర్పడబోతున్నట్టు ఇప్పటికే శాస్త్రవేత్తలు ఓ అంచనాకు వచ్చారు. అయితే, వాళ్లు ఊహించిన దాని కంటే వేగం గా ఈ పరిణామం జరుగుతున్నట్టు తాజాగా వెల్లడైంది. రానున్న 50 లక్షల ఏండ్ల నుంచి కోటి సంవత్సరాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యి.. భూగోళంపై ఆరవ మహాసముద్రం ఆవిర్భవించే అవకాశం ఉన్నట్టు నాసా, అమెరికా జియోలాజికల్ సర్వే, యూనివర్సిటీ ఆఫ్ రోచెస్టర్ పరిశోధకుల బృందం తెలిపింది.

# అమెరికాలో సంచలనం: 5 ఏళ్ల చిన్నారిని నిర్బంధించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు


2 లో

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): అమెరికా వలసదారులపట్ల కఠినంగా ప్రవర్తిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మిన్నెసోటా రాష్ట్రంలోని మినియాపోలిస్ నగరంలో సంచలన ఘటన చోటుచేసుకుంది. ప్రీ స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన ఐదేళ్ల బాలుడు లియామ్ కొనెహో రామోస్‌ను ఫెడరల్ ఇమిగ్రేషన్ అధికారులు అతని తండ్రితో కలిసి అదుపులోకి తీసుకుని టెక్సాస్‌లోని నిర్బంధ కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై అక్కడి ప్రజలు, ఆ చిన్నారి స్కూల్ సిబ్బంది, ఫ్యామిలీ లాయర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని వారాల్లో ఇదే ప్రాంతానికి చెందిన నాలుగో విద్యార్థిని ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్న ఘటన ఇది.

మంగళవారం మధ్యాహ్నం కుటుంబం ఇంటి డ్రైవ్‌వేలో కారు నడుస్తుండగానే అధికారులు బాలుడిని తీసుకెళ్లారని కొలంబియా హైట్స్ పబ్లిక్ స్కూల్స్ సూపరింటెండెంట్ జెనా స్టెన్‌విక్ తెలిపారు. ఇంట్లో ఎవరు ఉన్నారో తెలుసుకునేందుకు బాలుడిని తలుపు తట్టమని చెప్పారని, ఐదేళ్ల చిన్నారిని ఎరగా ఉపయోగించారు అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కుటుంబం 2024లో అమెరికాకు వచ్చిందని, వీరికి ఆశ్రయ (అసైలం) కేసు పెండింగ్‌లో ఉందని, దేశం విడిచిపోవాలనే ఆదేశాలు కూడా లేవని అధికారులు తెలిపారు. "ఐదేళ్ల పిల్లాడిని ఎందుకు అరెస్ట్ చేయాలి? అతడు హింసాత్మక నేరస్తుడని చెప్పగలరా?" అంటూ సూపరింటెండెంట్ ప్రశ్నించారు.

అయితే హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ప్రతినిధి ట్రిషియా మెక్‌లాఫ్లిన్ వివరణ ఇస్తూ, "ఇమ్మిగ్రేషన్ అధికారులు (ఐసిఈ) బాలుడిని లక్ష్యంగా చేసుకోలేదు.

# మున్సి"పల్స్"పై కాంగ్రెస్ రివ్యూ

## ఇద్దరు నేతలతో ఇరకాటం


2 లో

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతున్నది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల గెలుపు ఊపుతో మెజార్టీ మున్సిపాలిటీలను కైవసం చేసుకునేందుకు వ్యూహరచన చేస్తున్నది. అందులో భాగంగానే పార్టీ ముఖ్యులు, స్క్రీనింగ్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేయనున్నారు. ఈ క్రమంలో 24న రామగుండం, భూపాలపల్లి, 25 లేదా 26న ఇల్లెందు, నకిరేకల్ రివ్యూ చేయనున్నట్లు పార్టీవర్గాల ద్వారా తెలిసింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నిర్వహించే ఈ సమావేశాల్లో పార్టీ పనితీరు, విజయం కోసం తీసుకోవాల్సిన రాజకీయ వ్యూహాలు, బలమైన అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు నేతలు చెబుతున్నారు.




# ఒకే పార్టీ రెండు ఎత్తుగడలు

## మున్సిపాలిటీ ఎన్నికల్లో పొత్తులపై తర్జనభర్జన

- ✓వైరా రాజకీయాల్లో రెండు ఎత్తుగడలు
- ✓మున్సిపాలిటీ పొత్తులపై పెరుగుతున్న ఉత్కంఠ
- ✓కాంగ్రెస్‌తో సీపీఎం రెండు దఫాల చర్చలు
- ✓వార్డు కేటాయింపులే తగాదాకు కారణమా?
- ✓టీడీపీ డిమాండ్లుకాంగ్రెస్ నిర్ణయం
- ✓సీపీఎం డెడ్‌లైన్‌తో రాజకీయ ఒత్తిడి
- ✓బీఆర్ఎస్‌తో కలిసి వెళ్లాలన్న జిల్లా కమిటీ ఒత్తిడి
- ✓వైరాలో హస్తమా? కారా? తుది నిర్ణయం ఎప్పుడో!

మిగతాది 2 లో

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం )

వైరా మున్సిపాలిటీ ఎన్నికల వేళ ఓ రాజకీయ పార్టీ రెండు ఎత్తుగడలతో ముందుకెళ్తుంది. అయితే అటు, లేకుంటే ఇటు అన్న చందాగా ఆ పార్టీ వ్యవహరించడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉండగా నాలుగు మున్సిపాలిటీల్లో ఆ పార్టీ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుంది. కేవలం వైరా మున్సిపాలిటీ ఎన్నికల పొత్తుల విషయంలో ఆ పార్టీ తర్జనభర్జన పడుతోంది. వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఎం పార్టీ అధికార పార్టీ కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుంటుందా.. లేదా ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ తో కలిసి వెళ్తుందా అనే విషయం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అయితే ఇప్పటికే కాంగ్రెస్ సీపీఎం పార్టీలు పొత్తుల విషయమై రెండు దఫాలుగా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో తాము అడిగిన వార్డులను కేటాయిస్తే హస్తంతో దోస్తీకి సీపీఎం సిద్ధమైనట్లు తెలుస్తోంది. లేకుంటే కారులో షికారు చేసేందుకు రెడీ అవుతుంది.

# పుర'పోరు'కు కమలనాథులు సన్నద్ధం..

## ఐదు పట్టణాల్లో భారీ బహిరంగ సభలకు ప్లాన్


2 లో

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): మున్సిపల్ ఎన్నికలపై కమలనాథులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అందులో భాగంగానే ఇటీవలే హైకమాండ్ రాష్ట్రానికి ముగ్గురు ఇంచార్జీలను నియమించింది. వారి ఆధ్వర్యంలోనే ఎన్నికల ప్రక్రియ, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం సరళి ఉంటుంది. ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐదు చోట్ల బహిరంగ సభలు నిర్వహించాలని పార్టీపెద్దలు నిర్ణయించినట్లు తెలిసింది.

# స్వచ్ఛనగరంలో మళ్లీ కలుషిత నీటి కలకలం.. 22 మందికి అస్వస్థత


2 లో

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): స్వచ్ఛనగరంగా పేరొందిన ఇండోర్ లో మరోసారి కలుషిత నీరు కలకలం రేగింది. కొద్దిరోజుల క్రితమే నగరంలోని భగీరత్ పుర ప్రాంతంలో త్రాగునీటిలో డ్రైనేజీ నీరు కలవడంతో.. ఆ కలుషిత నీటిని తాగి 23 మంది మృతి చెందారు. ఈ ఘటన మరువకముందే మౌ అనే ప్రాంతంలో తాజాగా కలుషిత నీరు తాగి 22 మంది ఆస్పత్రిపాలయ్యారు. వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. బాధితులు వాంతులు, విరేచనాలు, తీవ్రమైన కడుపునొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్నారని తెలిపారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 24-01-2026

# బైక్ ట్యాక్సీలపై నిషేధం ఎత్తివేత.. కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులు

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): కర్ణాటక లో బైక్ టాక్సీ సేవలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పును వెలువరించింది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది వాహనదారులు, ప్రయాణికులు, ఓలా, ఉబెర్, రాపిడో లాంటి అగ్రిగేటర్లకు భారీ ఊరట లభించింది. ఏప్రిల్ 2025లో బైక్ టాక్సీ కార్యకలాపాలను నిలిపివేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను చీఫ్ జస్టిస్ విభు బఖ్రూ, జస్టిస్ సీఎం జోషితో కూడిన డివిజన్ బెంచ్ రద్దు చేసింది. ద్విచక్ర వాహనాలను రవాణా వాహనాలుగ నమోదు చేయడానికి వాటికి కాంట్రాక్ట్ క్యారేజీ పర్మిట్లు మంజూరు చేయాలని కోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసింది. బైక్ టాక్సీలు నడపడానికి అనుమతించినప్పటికీ, భద్రత దృష్ట్యా మోటార్ వాహనాల చట్టం ప్రకారం అవసరమైన నిబంధనలు, షరతులను విధించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని కోర్టు నొక్కి చెప్పింది. రాష్ట్రంలో సుమారు 6 లక్షల మంది బైక్ టాక్సీ ఆపరేటర్ల జీవనోపాధిని పరిగణనలోకి తీసుకుని కోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ధర్మాసనం వెల్లడించింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం బైక్ టాక్సీలను నిషేధించగా.. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ రాపిడో, ఉబెర్ వంటి సంస్థలు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించాయి. గతంలో వీటి వల్ల ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతింటుందని, భద్రతా సమస్యలు ఉన్నాయని ఆటో యూనియన్లు నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అయితే, బైక్ టాక్సీలు నిత్యావసరమని, జీవనోపాధి పొందే హక్కు అందరికీ ఉందని కోర్టు అభిప్రాయపడుతూ బైక్ ట్యాక్సీలపై బ్యాన్‌ను లిఫ్ట్ చేసింది.

## మున్సి"పల్స్"పై కాంగ్రెస్ రివ్యూ ఇద్దరు నేతలతో ఇరకాటం

**మొదటి పేజీ తరువాయి**

ఇదిలాఉండగా, పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా చేపట్టిన మొదటి సమీక్షలోనే కాంగ్రెస్ కు ఊహించని షాక్ తగిలింది. నిజామాబాద్ ఎంపీ పరిధిలో నియోజకవర్గాల సమీక్షలో మాజీమంత్రి టి.జీవన్ రెడ్డి ఆ సమావేశానికి హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ రాకపైన అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయిన ఆయన కాంగ్రెస్ సమావేశానికి ఎలా హాజరవుతారని ఫైర్ అయ్యారు. సమావేశం మధ్యలోనే బయటకు వెళ్లడంతో రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. రాబోయే సమీక్ష సమావేశాలపై పార్టీ అప్రమత్తమై నేతల మధ్య ఎలాంటి విభేదాలు ఉన్నా సయోధ్య కుదిర్చేలా ప్లాన్ చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో నేతల మధ్య సమన్వయం ఉంటేనే, అందరం ఐక్యంగా ముందుకెళ్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయన్న అంచనాల్లో ఉన్నట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.

# పుర'పోరు'కు కమలనాథులు సన్నద్ధం.. ఐదు పట్టణాల్లో భారీ బహిరంగ సభలకు ప్లాన్

**మొదటి పేజీ తరువాయి**

సభలకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ కు పంపించినట్లు సీనియర్లు తెలిపారు. ఎన్నికల ప్రచారానికి రాష్ట్ర నేతలతో పాటు జాతీయ నాయకత్వం, వివిధ రాష్ట్రాలకు చెందిన మంత్రులు కూడా రానున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కరీంనగర్, నిజామాబాద్ సభలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా, మహబూబ్‌నగర్‌లో జరిగే సభకు జేపీ నడ్డా, సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో రాజ్ నాథ్ సింగ్ హాజరుకానున్నారు. సభలను విజయవంతం చేసేలా పనిచేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పదాధికారులతో జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్‌ను ఎదుర్కొని మెజార్టీ సీట్లు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లాల నేతలకు సూచించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ కలకలం

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ కలకలం రేగింది. ఎయిర్ పోర్ట్ అవుట్ పోస్ట్ ఇన్స్పెక్టర్ కనకయ్య సంపతి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ కు చెందిన నాథూరామ్ తిరుపతిలో దైవదర్శనం చేసుకొని శంషాబాద్ మీదుగా తన స్వస్థలానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శంషాబాద్ ఎయిర్పోర్టులో అతని లగేజీని తనిఖీ చేయగా అందులో ఒక బుల్లెట్ లభ్యమయింది. సిఐఎస్ఎఫ్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకొని ఎయిర్ పోర్టు పోలీసులకు అప్పగించారు. నాథూరామ్ కు లైసెన్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పొరపాటున అతడు లగేజీలో ఉన్న దుస్తుల్లో బుల్లెట్ ను పొరపాటున తీసుకొచ్చినట్లు గుర్తించారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

## జిల్లాలో తీవ్ర విషాదం.. కుటుంబం ఆత్మహత్య ?

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన తీవ్ర విషాద ఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటుచేసుకుంది. జియ్యమ్మవలస మండలం వనజ గ్రామానికి చెందిన కుటుంబం విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు మీనాక మధు (35), భార్య సత్యవతి (30), కూతురు మోస్య (4)గా గుర్తించారు. మరో కూతురు కొన ఊపిరితో ఉండగా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఆ చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా.. మధు – సత్యవతిల మధ్య జరిగిన గొడవ కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా స్థానికులు చెప్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. వారి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# అమెరికాలో సంచలనం: 5 ఏళ్ల చిన్నారిని నిర్బంధించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు

**మొదటి పేజీ తరువాయి**



అతని తండ్రి అడ్రియన్ అలెగ్జాండర్ కొనెహో ఆరియాస్ అక్రమంగా అమెరికాలో ఉన్నాడు. అతడు పరారయ్యే ప్రయత్నంలో పిల్లాడిని వదిలిపెట్టి పారిపోయాడు" అని తెలిపారు. పిల్లాడి భద్రత కోసమే ఒక అధికారి అతడితో ఉండగా మిగతా అధికారులు తండ్రిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. తల్లిదండ్రులకు పిల్లలను తమతో తీసుకెళ్లాలా లేక తమకు ఇష్టమైన వ్యక్తికి అప్పగించాలా అనే ఎంపిక ఇస్తామని తెలిపారు.

కుటుంబ న్యాయవాది మార్క్ ప్రోకోష్ తెలిపిన ప్రకారం.. బాలుడు, అతని తండ్రిని టెక్సాస్‌లోని డిల్లీ నిర్బంధ కేంద్రానికి తరలించారు. వారితో ఇప్పటివరకు ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం లేదని తెలిపారు. చట్టపరమైన మార్గాల్లో లేదా ప్రజా ఒత్తిడి ద్వారా వారిని విడుదల చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

ఈ ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందిస్తూ, "చిన్నారిని అరెస్ట్ చేయలేదు, కేవలం నిర్బంధించారు. అక్రమ వలసదారుడిని అరెస్ట్ చేయకుండా వదిలేయాలా? పిల్లాడిని చలిలో వదిలేయాలా? అధికారులు ఆ చిన్నారి తండ్రిని మాత్రమే టార్గెట్ చేశారు" అంటూ వ్యాఖ్యానించారు. యూఎస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ కమలాహారిస్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు చిన్నారిని నిర్బంధించడం తనను తీవ్రంగా కలచివేసిందంటూ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

ఇదిలా ఉండగా.. గత రెండు వారాల్లో కొలంబియా హైట్స్ పబ్లిక్ స్కూల్స్‌లో విద్యార్థుల హాజరు గణనీయంగా తగ్గిపోయిందని అధికారులు తెలిపారు. ఒకరోజు దాదాపు మూడో వంతు విద్యార్థులు స్కూల్‌కు రాలేదని వెల్లడించారు. "ఐసిఈ అధికారులు మా పాఠశాలల చుట్టూ తిరుగుతూ, బస్సులను అనుసరిస్తూ పిల్లలను తీసుకెళ్తున్నారు. ఇది తీవ్రమైన మానసిక వేదన కలిగిస్తోంది" అని సూపరింటెండెంట్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎగిరిపోయిన రూ.80వేల చిలుక.. కోనసీమలో యజమాని ఆవేదన



న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): అతనొక పక్షి ప్రేమికుడు. ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న రూ.80 వేల చిలుక పండుగ రోజే పంజరం నుంచి ఎగిరిపోవడంతో దాని ఆచూకీ కోసం చుట్టుపక్కలంతా వెతికాడు. ఎక్కడా కనిపించకపోవడంతో లబోదిబోమంటున్నాడు. మూడేళ్లుగా పెంచుకుంటున్న తన "చార్లీ" కనిపించకుండా పోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపాలెంలో వెలుగుచూసింది ఈ వింత ఘటన.

గ్రామానికి చెందిన బండారు దొరబాబు అనే వ్యక్తి కాట్రేనికోనలో వస్త్ర దుకాణం నడుపుతున్నాడు. పక్షులంటే ఎనలేని ఇష్టం. ఆ ఇష్టంతోనే మూడేళ్ల క్రితం హైదరాబాద్ లో రూ.80 వేలు పెట్టి మనుషుల్లా మాట్లాడే ఆఫ్రికన్ గ్రే ప్యారట్ జాతికి చెందిన చిలుకను కొన్నాడు. అప్పటి నుంచీ దానిని ఎంతో అపురూపంగా పెంచుకుంటున్నాడు. దాని అల్లరి చూసి మురిసిపోయేవాడు. ఈ ఏడాది సంక్రాంతి రోజున చార్లీ పంజరం నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాలేదు. ఎంత వెతికినా కనిపించలేదు. 10 రోజులైనా దాని ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కంప్లైంట్ ఇవ్వాలని డిసైడయ్యాడు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

# ఒకే పార్టీ రెండు ఎత్తుగడలు

## మున్సిపాలిటీ ఎన్నికల్లో పొత్తులపై తర్జనభర్జన

**మొదటి పేజీ తరువాయి**

కాంగ్రెస్ తో రెండు దఫాలుగా చర్చలు..

వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎం పార్టీలు పొత్తు పెట్టుకునేందుకు ఇప్పటికే రెండు దఫాలుగా చర్చలు జరిగాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీతో టీడీపీ ఎన్నికల్లో కలిసి ప్రయాణించాలని నిర్ణయించింది. అయితే పొత్తుల్లో భాగంగా వార్డు సీట్ల కేటాయింపులో తర్జనభర్జన పడుతున్నారు. ఈ చర్చల్లో సీపీఎం పార్టీ 5, 6, 9, 10, 19 వార్డులను తమకు కేటాయించాలని స్పష్టం చేసింది. వీటితోపాటు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవి తమకు ఇవ్వాలని సిపిఎం చర్చల్లో తమ అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. అదే విధంగా టీడీపీ పార్టీ 5, 8, 17, 18 వార్డులను తమకు ఇవ్వాలని కోరింది.

ఈ రెండు పార్టీల ప్రతిపాదనలపై కాంగ్రెస్ పార్టీ ఓ అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. టీడీపీ పార్టీకి 8, 18 వార్డులు కేటాయించాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతుంది. అదేవిధంగా సీపీఎం పార్టీకి 6,10,19 వార్డుల్లో వారు కోరుకున్న రెండు వార్డులను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ రెండు పార్టీలకు పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఒక్కొ కో – ఆప్షన్ పదవిని ఇచ్చేందుకు కాంగ్రెస్ సుముఖత చూపుతుంది. అయితే పొత్తుల విషయమై ఈ నెల 21వ తేదీ సాయంత్రం కల్లా తమకు క్లారిటీ ఇవ్వాలని సీపీఎం డెడ్ లైన్ విధించినట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ తో చర్చలు నిర్వహించిన తర్వాత టీడీపీ పార్టీ అధిష్టానం మున్సిపాలిటీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు పోటీ చేయవద్దని సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వైరా మున్సిపాలిటీలో పొత్తుల వ్యవహారం కొలిక్కి రావడం లేదు.

కారులో షికారుకు రెడీ..?

ఖమ్మం జిల్లాలో వైరా, ఏదులాపురం, మధిర, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. వైరా మున్సిపాలిటీ మినహా మిగిలిన నాలుగు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ తో సీపీఎం కలిసి పోటీ చేస్తుంది. ఈ మేరకు బీఆర్ఎస్, సీపీఎం జిల్లా కమిటీలు చర్చలు కూడా జరిపాయి. అయితే వైరా ఒక్క మున్సిపాలిటీలోనే కాంగ్రెస్ తో పొత్తుకు వెళ్లేందుకు జిల్లా కమిటీకి స్థానిక నేతలు లేఖ రాశారు. జిల్లా కమిటీ తుది నిర్ణయం రాకముందే కాంగ్రెస్ తో స్థానిక సీపీఎం నాయకులు చర్చలు జరిపారని ప్రచారం జరుగుతుంది. దీంతో గత రెండు రోజుల క్రితం జిల్లాలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సీపీఎం జిల్లా కమిటీ తో మాట్లాడినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సీపీఎం, బీఆర్ఎస్ కలిసి పోటీ చేయాలని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సీపీఎం జిల్లా అధినాయకత్వానికి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

దీంతో వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఎం పార్టీ అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలో నిర్ణయించుకోలేని పరిస్థితి కనిపిస్తుంది. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో సామినేని రామారావు హత్యకు కాంగ్రెస్ పార్టీ కారణమని చూపుతూ సీపీఎం పార్టీ కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకోమని స్పష్టం చేసింది. అయితే వైరా నియోజకవర్గంలోని పలు గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీతోనే సీపీఎం పొత్తు పెట్టుకుంది. దీంతో ఆ ఎన్నికల సమయంలో సిపిఎం పార్టీలోనే భిన్న స్వరాలు వినిపించాయి. వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఎం పార్టీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే.


## జనగణన జీవో జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): తెలంగాణ ప్రభుత్వం జనగణన2027కు సంబంధించి జీవో జారీ చేసింది. ఈ జనగణన దేశవ్యాప్తంగా రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశలో 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఇళ్ల వివరాలు, భవనాలు, నిర్మాణాలపై సమాచారం సేకరిస్తారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా లెక్కలు మొదలుపెట్టి, మార్చ్ 1 అర్ధరాత్రి వరకు పూర్తి కానుంది. ఈసారి జనగణనతోపాటు కుల గణనను కూడా చేయనున్నారు. మొత్తం ప్రక్రియ డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది.

ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో భాగంగా గ్రామాలు, మండలాలు, జిల్లాల సరిహద్దులను అప్‌డేట్ చేయడం, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం, శిక్షణ వంటి సన్నాహాలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే జనగణన పూర్తయ్యే వరకు జిల్లాలు, నియోజకవర్గాల సరిహద్దుల్లో మార్పులు చేయరాదని స్పష్టం చేశారు. ఈ జనగణన తర్వాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉండటంతో ఈ ప్రక్రియకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

# పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు.. రంగంలోకి దిగిన డాగ్, బాంబ్ స్క్వాడ్

**మొదటి పేజీ తరువాయి**




న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): దేశవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ సంబురాల వేళ ఈ–మెయిల్ ద్వారా అందుతున్న బాంబు బెదిరింపులు అటు పోలీసులతో పాటు సాధారణ ప్రజలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తాజాగా ఉదయం గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ లోని పలు పాఠశాలు, నోయిడా లోని శివ్ నాడార్ స్కూల్‌కు బాంబు బెదిరింపు ఈ–మెయిల్స్ వచ్చాయి.

దీంతో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యాలు స్థానిక పోలీసులకు సమాచారం అందజేయగా.. వారు డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీమ్స్‌తో ఘటనా స్థలానికి చేరుకుని ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులు, సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని, పాఠశాల యాజమాన్యాలు తక్షణమే స్కూళ్లను ఖాళీ చేయించాయి. చాలాచోట్ల తల్లిదండ్రులను పిలిపించి పిల్లలను ఇంటికి పంపించివేశారు. ప్రస్తుతం పోలీసులు పాఠశాల ప్రాంగణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని.. అసలు ఈ–మెయిల్ ఎవరు పంపారు.. ఎక్కడి నుంచి వచ్చింది? అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

# స్వచ్ఛనగరంలో మళ్లీ కలుషిత నీటి కలకలం.. 22 మందికి అస్వస్థత

**మొదటి పేజీ తరువాయి**

సస్పెండ్ చేసినా మారని అధికారుల తీరు?; జిల్లా కలెక్టర్ శివం వర్మ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. ఈ ఘటనలో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నాయి. త్రాగునీటిని సరఫరా చేస్తున్న లైన్లలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా? త్రాగునీటిలో మురుగునీరు కలుస్తుందా? అని మున్సిపల్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. గతంలో కలుషిత నీటి కారణంగా సంభవించిన మరణాలకు బాధ్యుల్ని చేస్తూ ప్రభుత్వం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసింది. అయినా మళ్లీ అలాంటి ఘటనే రిపీట్ కావడంతో అధికారుల పనితీరుపై బాధితులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్రాగునీరు మురుగునీటి వాసన వస్తుందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. మరోవైపు త్రాగునీటిని ఫిల్టర్ చేసి, కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని, పైపుల ద్వారా వచ్చేనీటిని నేరుగా వాడొద్దని అధికారులు హెచ్చరించారు.

# హుబ్బళ్లిలో భారీ అగ్నిప్రమాదం .. సుఖసాగర్ మెట్రో మాల్‌లో చెలరేగిన మంటలు

న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లిలోని మరాఠా గల్లీలో ఉన్న సుఖసాగర్ మెట్రో మాల్‌లో గురువారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మాల్‌లోని నాలుగో, ఐదో అంతస్తులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఫర్నిచర్, దుస్తుల షాపులు సహా అనేక వాణిజ్య దుకాణాలు కాలిబూడిదయ్యాయి. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానిక అధికారులు వెల్లడించారు.

సమాచారం అందుకున్న వెంటనే పోలీస్ కమిషనర్ ఎన్. శశికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. అగ్నిమాపక దళాలు, సమీప ప్రాంతాల నుంచి వచ్చిన అదనపు వాహనాలతో మూడు గంటలకుపైగా మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించడంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ ఘటనపై పోలీస్ కమిషనర్ శశికుమార్ స్పందించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అగ్నిప్రమాదం మొదట నాలుగో అంతస్తులో ప్రారంభమై, ఆపై ఐదో అంతస్తుకు వ్యాపించింది. ప్రతి అంతస్తులో సుమారు 4 వేల నుంచి 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం ప్రకారం మంటలు చెలరేగడానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నామని పేర్కొన్నారు.

సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక శాఖ వాహనాలు, ఫైర్ ఇంజిన్లు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు 3 గంటలు శ్రమించాయన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయపడినట్లు సమాచారం లేదన్నారు. ప్రస్తుతం ఒక దుస్తుల దుకాణం, ఒక ఫర్నిచర్

# చీలిపోతున్న ఆఫ్రికా.. 50 లక్షల ఏండ్లలో కొత్త మహా సముద్రం



న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): ప్రపంచ పటాన్ని శాశ్వతంగా మార్చివేసేలా ఆఫ్రికా ఖండం చీలిపోతున్నది. తూర్పు ఆఫ్రికాలో భౌగోళిక మార్పులు వేగంగా సంభవిస్తున్నాయి. టెక్టానిక్ ప్లేట్ల (భూమి ఫలకాల) కదలికల వల్ల ఆఫ్రికా ఖండం చీలిపోయి అక్కడ కొత్తగా మరో మహా సముద్రం ఏర్పడబోతున్నట్టు ఇప్పటికే శాస్త్రవేత్తలు ఓ అంచనాకు వచ్చారు. అయితే, వాళ్లు ఊహించిన దాని కంటే వేగం గా ఈ పరిణామం జరుగుతున్నట్టు తాజాగా వెల్లడైంది. రానున్న 50 లక్షల ఏండ్ల నుంచి కోటి సంవత్సరాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యి.. భూగోళంపై ఆరవ మహాసముద్రం ఆవిర్భవించే అవకాశం ఉన్నట్టు నాసా, అమెరికా జియోలాజికల్ సర్వే, యూనివర్సిటీ ఆఫ్ రోచెస్టర్ పరిశోధకుల బృందం తెలిపింది.

ప్రస్తుతం భూమిపై పసిఫిక్, అట్లాంటిక్, హిందూ, ఆర్కిటిక్, దక్షిణ మహా సముద్రాలు ఉన్నాయి. అయితే ఆఫ్రికా ఖండంలోని ఇథియోపియా నుంచి మొజాంబిక్ వరకు విస్తరించి ఉన్న గ్రేట్ రిఫ్ట్ వ్యాలీ ప్రాంతంలోని భూ అంతర పొరల్లో రాపిడిల వల్ల నుబియన్ టెక్టానిక్ ప్లేట్ నుంచి సోమాలియన్, అరేబియన్ టెక్టానిక్ ప్లేట్స్ విడిపోతున్నాయని, దీంతో ఆఫ్రికా ఖండం చీలిపోయి అక్కడ హిందూ మహా సముద్రం నీటితో కొత్తగా మరో మహా సముద్రం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఇథియోపియా, కెన్యా లాంటి ప్రాంతాల్లో భూమి ఉపరితలంపై పగుళ్లు ఏర్పడటం తెలిసిందే.

## జైల్లో చిగురించిన ప్రేమ.. పెళ్లికి ఎమర్జెన్సీ పెరోల్




న్యూస్ డెస్క్, 23 జనవరి (ఇది కద నిజం ): వాళ్లిద్దరూ హత్యకేసుల్లో దోషులు. ఆమె డేటింగ్ యాప్ లో పరిచయమైన వ్యక్తిని హత్యచేసి జైలుకెళ్లింది. అతను ఏకంగా ఐదుగురిని చంపి శిక్ష అనుభవిస్తున్నాడు. వీరిద్దరి మధ్య జైల్లోనే ప్రేమ చిగురించింది. అది పెళ్లికి దారితీసింది. ఇంకేముంది పెళ్లి చేసుకునేందుకు పెరోల్ ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. వారి పెరోల్ పిటిషన్ ను పరిశీలించిన రాజస్థాన్ హైకోర్టు ఎమర్జెన్సీ పెరోల్ మంజూరు చేసింది. ప్రియాసేథ్ అలియాస్ నేహా సేథ్ – హనుమాన్ ప్రసాద్ నేడు అల్వార్ జిల్లా బరోడామేవ్ లో పెళ్లి చేసుకోనున్నారు. ఖైదీల మధ్య చిగురించిన ప్రేమ పెళ్లికి దారితీయడం, అందుకు కోర్టు ఎమర్జెన్సీ పెరోల్ ఇవ్వడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ప్రియా సేథ్ అలియాస్ నేహా సేథ్ వృత్తిరీత్యా మోడల్. ఆమెకు టిండర్ అనే డేటింగ్ యాప్ ద్వారా 2018లో దుష్యంత్ శర్మ అనే యువకుడు పరిచయం అయ్యాడు. అతడిని తన ప్రేమలోకి దింపి, ఆపై కిడ్నాప్ చేసి, డబ్బులు వసూలు చేసి అప్పట్లో తన ప్రియుడైన దిక్షాంత్ కాంబ్రా అప్పుల్ని తీర్చాలని ప్లాన్ చేసింది. ప్లాన్ ప్రకారం.. దుష్యంత్ తో పరిచయం పెంచుకున్న ప్రియ అతడిని 2018 మే2న బజాజ్ నగర్లో ఉన్న తన ఫ్లాట్ కు పిలిచింది. ఆ తర్వాత అతడి తండ్రికి ఫోన్ చేసి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆయన రూ.3 లక్షలు పంపాడు. దుష్యంత్ ను వదిలేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తాడన్న భయంతో ప్రియ, దిక్షాంత్, మరో స్నేహితుడు లక్ష్య వాలియాతో కలిసి కత్తితో పొడిచి హతమార్చారు. ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు ముఖంపై కత్తితో గాయాలు చేసి, డెడ్ బాడీని సూట్ కేసులో పెట్టి ఆమర్ కొండల్లో పడేశారు. ఆపై ఫ్లాట్ లో ఆధారాలను తొలగించారు. మే3వ తేదీ రాత్రి డెడ్ బాడీ పోలీసులకు దొరకగా.. డాగ్ స్క్వాడ్, ఇతర ఆధారాలతో ఆ ముగ్గురినీ అరెస్ట్ చేశారు. ఈ కేసులో నేరనిర్ధారణ కావడంతో ప్రియాసేథ్ జైలుశిక్ష అనువిస్తోంది.

హనుమాన్ ప్రసాద్ తన ప్రేయసి భర్త, పిల్లలను హత్య చేసిన కేసులో శిక్ష అనుభవిస్తున్నాడు. అతని ప్రేయసి సంతోష్ ఆల్వర్ తైక్వాండో క్రీడాకారిణి. అతనికంటే 10 ఏళ్లు పెద్దది. 2017 అక్టోబర్ 2 రాత్రి, సంతోష్ తన భర్త, పిల్లలను హత్య చేయాలని ప్రసాద్‌ను ఇంటికి పిలిచింది. అతడు మరో వ్యక్తితో కలిసి వెళ్లి, జంతువులను కోసే కత్తితో ఆమె భర్త బన్వారీ లాల్‌ను హత్య చేశాడు. ఈ హత్యను చూసిన సంతోష్ ముగ్గురు పిల్లలు, ఆమె సోదరి కుమారుడు భయంతో కేకలు వేయడంతో, సాక్షులు మిగలకూడదని సంతోష్ వారినీ హత్య చేయమని ఆదేశించింది. ఆ రాత్రి నలుగురు పిల్లలు, ఒక వ్యక్తి దారుణంగా హతమయ్యారు. ప్రస్తుతం ప్రియా సేథ్, హనుమాన్ ప్రసాద్ లు జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్నారు. ఇంతటి ఘోరమైన నేరచరిత్ర ఉన్న ఇద్దరు ప్రేమలో పడటం, పెళ్లిచేసుకోవడం దేశవ్యాప్తంగా తీవ్రచర్చకు దారితీసింది.

# కుటుంబ కలహాలతో

## లంగర్‌హౌస్‌లో యువకుడు ఆత్మహత్య




ఇది కద నిజం, లంగర్‌హౌస్: హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా శివ అనే యువకుడు తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. ప్రశాంత్ నగర్ ఫేజ్2లో నివసిస్తున్న శివకు, అతని భార్యకు మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ మనస్పర్థల కారణంగా వీరిద్దరూ ఇటీవల విడివిడిగా ఉంటున్నారు. భార్యతో దూరంగా ఉంటున్న శివ, తీవ్ర మనస్తాపానికి గురై నిన్న రాత్రి తన గదిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.సమాచారం అందుకున్న లంగర్‌హౌస్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆత్మహత్యకు గల పూర్తి కారణాలపై లోతైన విచారణ జరుపుతున్నారు.

# తాళ్లగడ్డ స్టేడియంలో హోరాహోరీగా సాగిన రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్




ఇది కద నిజం,హైదరాబాద్: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన నాలుగవ శ్రీ శివ మార్కండేయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ ఘనంగా ముగిసింది. ఈ పోటీలు ఈ నెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లోని తాళ్లగడ్డ రాజా లింగయ్య కబడ్డీ స్టేడియంలో జరిగాయి. ఈ ఛాంపియన్‌షిప్‌కు నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి యువ రెజ్లర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ బరువు విభాగాల్లో ఉత్కంఠభరితంగా సాగిన పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 38 కేజీల విభాగంలో ఆర్య సమాజ్ అకాడమీ కి చెందిన దినేష్ అద్భుతమైన ప్రదర్శనతో ప్రత్యర్థులను మట్టికరిపించి గోల్డ్ మెడల్ను సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా, విజేతకు సైకిల్ బహుమతిగా అందుకున్నాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఇలాంటి క్రీడా పోటీలు యువతను క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు నడిపిస్తాయని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# యాదగిరిగుట్టలో ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు



ఇది కద నిజం, యాదగిరిగుట్ట, జనవరి 23: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ఘనంగా జరిగాయి. పట్టణ మరియు మండల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి రేగు బాలానర్సయ్య మాట్లాడుతూ లోకేష్ నాయకత్వంలో యువతకు పెద్దపీట వేస్తూ తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో లోకేష్ పోరాట పటిమ కార్యకర్తల్లో కొత్త ఉత్తేజాన్ని నింపుతోందని, రానున్న రోజుల్లో పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ అడ్ హాక్ కమిటీ సభ్యులు గుండా బాస్కర్, మండల పార్టీ అధ్యక్షులు మచ్చ నర్సింహాగౌడ్, ప్రధాన కార్యదర్శి కళ్లెం బాబురావు గౌడ్ పాల్గొన్నారు. అలాగే పట్టణ శాఖ అధ్యక్షులు చైతర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముక్కర్ల శ్రీశైలం యాదవ్, ఉపాధ్యక్షులు కోలా వెంకటేష్, నాయకులు వామాల సత్యనారాయణ, శేషగిరి రావు, దుర్గపతి, కృష్ణ, రాజసింగ్ తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కుక్కునూరులో ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు



ఇది కద నిజం, కుక్కునూరు: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను కుక్కునూరు మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకుడు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, జనసేన మండల అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్, బీజేపీ నాయకులు బాలమణికంఠ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఇందులో భాగంగా టీడీపీ సీనియర్ నాయకుడు కోటగిరి సత్యనారాయణ చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పాలు, రొట్టెలను పంచిపెట్టారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో కుక్కునూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చుక హరిబాబు, ఓలేటి వెంకటేశ్వరరావు, ములిశెట్టి నరేష్, బాలాజీ, పాదం రాము, సొసైటీ మాజీ అధ్యక్షులు రావు శ్రీనివాసరావు, ఊట్కూరు రాజారావు, గడ్డి కొప్పుల సీతయ్య, సతీష్, ముత్యాలరావు, సురేష్, డాక్టర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# బహదూర్‌పురాలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు


ఇది కద నిజం,హైదరాబాద్, జనవరి 23: బహదూర్‌పురా నియోజకవర్గం, దూద్‌బౌలి డివిజన్‌లోని శాంతినికేతన్ హైస్కూల్ ప్రాంగణంలో జాతీయ ఓటర్ల దినోత్సవ సంబరాలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని, అయితే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ECI) ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ నుంచే వేడుకలు ప్రారంభించాలని సూచించడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ మరియు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (AERO) శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో ఓటు హక్కు ఒక శక్తివంతమైన ఆయుధమని, నాయకుల తలరాతలను మార్చే శక్తి కేవలం ఓటరుకే ఉంటుందని స్పష్టం చేశారు. యువత దేశ భవిష్యత్తును నిర్ణయించాలనే ఉద్దేశంతోనే స్వర్గీయ రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకు తగ్గించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

త్వరలోనే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటర్ జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం 17 ఏళ్లు నిండిన వారు కూడా ముందస్తుగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, వారికి 18 ఏళ్లు నిండగానే ఓటు హక్కు లభిస్తుందని వివరించారు. ఓటర్ల జాబితా సవరణ ఇప్పుడు ఏడాదికి నాలుగు సార్లు (జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్) జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మార్పులు చేర్పులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈసీఐ విడుదల చేసిన లోగోను పట్టుకొని "ఓటు వేస్తాం - ప్రజాస్వామ్యాన్ని కాపాడతాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కోఆర్డినేటర్ భార్గవి, బీఎల్ఓ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, కరీముల్లా, ఇమ్రాన్, ఏ. శ్రీనివాస్, గంటి రమేష్, శ్రీనివాస్ యాదవ్, అరుణ మరియు కాంగ్రెస్ ఇంచార్జ్ పులిపాటి రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ఆలేరు పట్టణంలో చేనేత రుణమాఫీ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ఇది కద నిజం, యాదాద్రి:యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో చేనేత వృత్తిదారులకు ఊరటనిచ్చేలా చేనేత రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన చేనేత కార్మికులకు రుణమాఫీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన బలమని, వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రుణభారం నుంచి విముక్తి కలిగించడం ద్వారా చేనేత కార్మికులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గంలో నేతన్న రుణమాఫీ పథకం కింద (362) మంది చేనేత కార్మికులకు రూ. 2.69 కోట్లతో ప్రతిపాదనలు సమర్పించడం జరిగింది. దీనిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మొదటి విడతగా ఆలేరు పట్టణం మరియు యాదగిరిగుట్ట పట్టణం పరిధిలోని (164) చేనేత కార్మికుల యొక్క చేనేత కార్మికులకురూ. 1.18 కోట్ల నిధులు విడుదల చేయడం జరిగింది. 1.ఆలేరు పట్టణంలో (151) చేనేత కార్మికులకు రూ. 1.10 కోట్లు. 2.యాదగిరిగుట్ట పట్టణంలో (13) చేనేత కార్మికులకు రూ. 0.83 కోట్లు నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో నేతన్నకు పొదుపు పథకం కింద (1607) మంది చేనేత కార్మికులు నమోదు అయినారు. వీరికి నెలకు రూ. 32.00 లక్షల చొప్పున ఇప్పటివరకు రూ. 64.00 లక్షల నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు... అలాగే ఈ పథకంలో భాగంగా (2021-24) కాలానికి గాను ఆలేరు నియోజకవర్గం లోని (1862) చేనేత కార్మికుల కార్మికులకు రూ. 18.60 కోట్ల నిధులు విడుదల చేయడం జరిగింది. ఇట్టి నిధులను అకౌంట్ల లో జమ చేయడం జరిగింది. నేతన్నకు భీమా పథకం కింద ఆలేరు నియోజకవర్గంలో ఇప్పటివరకు చేనేత మర మగ్గములో (2257) కార్మికులు నమోదు కాబడ్డారు.. ఇప్పటివరకు చనిపోయిన కార్మికులు (52) మంది వారి యొక్క నామినిలకు రూ. 1.60 కోట నిధులు విడుదల చేయబడ్డాయి.

# యాదగిరిగుట్టలో రోడ్డు భద్రతపై పోలీసుల వినూత్న అవగాహన

- ప్రాణం మీదికి తెచ్చుకోకండి
- క్షేమంగా ఇంటికి చేరండి!
- యాదగిరిగుట్టలో ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో 'అరైవ్ అండ్ అలైవ్' అవగాహన సదస్స




ఇది కద నిజం,యాదగిరిగుట్ట, జనవరి 23: రోడ్డు నిబంధనల పట్ల నిర్లక్ష్యం వహిస్తే అది నిండు ప్రాణాలనే బలి తీసుకుంటుందని ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దకుందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో 'అరైవ్ అండ్ అలైవ్' (Arrive& Alive) అనే ప్రత్యేక రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలకు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం మరియు హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణాలని గణాంకాలతో వివరించారు. క్షణ కాలపు అజాగ్రత్త ఒక కుటుంబంలో తీరని శోకాన్ని నింపుతుందని, వాహనదారులు సంయమనంతో ప్రయాణించాలని కోరారు.

అనంతరం ట్రాఫిక్ సీఐ కృష్ణ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు అనేవి కేవలం పోలీసులు వేసే జరిమానాల కోసం కాదని, అవి ప్రతి పౌరుడి భద్రత కోసమని గుర్తుచేశారు. కంపెనీ కార్మికులకు రోడ్డు భద్రతా నియమాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దేవేందర్, ఆర్.ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది హనుమంతు, నరేష్ మరియు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. పోలీసులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం స్థానికుల్లో మంచి స్పందన లభించింది.

# అనంతారం ప్రీమియర్ లీగ్ 2 ప్రారంభించిన యూత్ ఐకాన్ ఇలియాస్ మొహమ్మద్

- సొంతం నిధులతో 150 క్రీడాకారులకు టీ-షర్టుల పంపిణీ



ఇది కద నిజం,భువనగిరి రూరల్/ జనవరి 23: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారం గ్రామంలో అనంతారం ప్రీమియర్ లీగ్ 2 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూత్ ఐకాన్ ఇలియాస్ మహమ్మద్ హాజరై టోర్నమెంట్ను ప్రారంభించారు. ముందుగా వారి సొంత నిధులతో గ్రామంలోని యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 150 టీ-షర్టులను ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పల్లెపాటి నాగరాణి రాజలింగం, భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు గారు , ఎస్సై అనిల్ కుమార్ గారు హాజరై క్రీడాకారులకు టీ-షర్టులను అందజేశారు

ఈ సందర్భంగా ఇలియాస్ మొహమ్మద్ గారు మాట్లాడుతూ, "క్రీడలు మానసిక ఉత్తేజాన్ని, శారీరక దృఢత్వాన్ని ఇస్తాయి. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం మన బాధ్యత. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగమణి రాజలింగం, సీఐ చంద్రబాబు, ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇలియాస్ చేపడుతున్న సామాజిక సేవలను హృదయపూర్వకంగా అభినందించారు. యువతలో క్రీడా ఆసక్తిని పెంచడం ద్వారా సమాజంలో మానసిక ఉల్లాసం, ఆరోగ్యవంతమైన జీవనశైలి పెరుగుతుందని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు.సమాజంలో నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ, యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఇలియాస్ మహమ్మద్ ఇటీవల కాలంలో విద్య, ఆరోగ్యం, క్రీడల రంగాల్లో అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారు. ఈ చొరవలు గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని మరింత పెంచుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అనంతరం సీఐ టాస్ వేసి ఆటాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పకీరు కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున్, యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సహకారంతో గణేష్ సేన ఆధ్వర్యంలో ధర్మ రక్షణ సభ

ఇది కద నిజం,రంగా రెడ్డి జిల్లా: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సహకారంతో గణేష్ సేన ఆధ్వర్యంలో రేపు బాలాపూర్ గ్రామంలో నిర్వహించనున్న ధర్మ రక్షణ సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. మీడియాను ఉద్దేశించి మాట్లాడిన రావినూతల శశిధర్ "మా ఉద్దేశం ఒక్కటే. భాగ్యనగరం నుంచి అక్రమంగా వలస వచ్చిన వారిని తిరిగి వారి దేశాలకు పంపించాలని ప్రభుత్వాన్ని కోరడమే" అని స్పష్టం చేశారు. రేపు బాలాపూర్ గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్న ఈ సభకు పార్టీలకు, మతాలకు అతీతంగా అందరూ ఆహ్వానితులే అని ఆయన చెప్పారు. సభకు హాజరయ్యే వారు కషాయం జెండా మరియు జాతీయ జెండాలను చేతపట్టి పాల్గొనాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన విలేకరుల సమావేశం ప్రధాన ఉద్దేశం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, బంగ్లాదేశ్ మరియు బర్మా (మయన్మార్)కు చెందిన అక్రమ వలసదారులను తెలంగాణతో పాటు దేశం నుంచి పంపించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడమే అని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు, హిందుత్వ సంఘాల ప్రతినిధులు, పార్టీలకు అతీతంగా ఉన్న పలువురు నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషద్ ఇంటర్నేషనల్ ఎక్స్ ప్రెసిడెంట్ రాఘవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్, కోలన్ శంకర్ రెడ్డి, చిగురింత్ నరసింహా రెడ్డి, వంగేటి లక్ష్మ రెడ్డి, ఏళ్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# హైదర్‌గూడలో ఘనంగా పరాక్రమ దివస్

## ● నేతాజీకి ఘన నివాళి



ఇది కద నిజం, అత్తాపూర్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని హైదర్‌గూడలో పరాక్రమ దివస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అత్తాపూర్ కార్పొరేటర్ మొంద్ర సంగీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం నేతాజీ చేసిన త్యాగాలు, ఆయన చూపిన ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదర్‌గూడ నుంచి జనప్రియ వరకు 2ఖ రన్ నిర్వహించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర జరిగిన ఈ పరుగులో స్థానిక యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "జై హింద్", "నేతాజీ అమర్ రహే" అంటూ యువత చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది.

● నేతాజీ ఆశయ సాధనే యువత లక్ష్యం కావాలి: సుల్గే వెంకటేష్ పిలుపు

నేతాజీ సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, "భారత స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఒక ధ్రువతార అని, 'మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వతంత్రం ఇస్తాను' అన్న ఆయన నినాదం నాటికీ, నేటికీ యువతలో రక్తంలో ఉత్సాహాన్ని నింపుతుందని" కొనియాడారు. కేవలం అహింసా మార్గమే కాకుండా, సాయుధ పోరాటం ద్వారా కూడా బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించవచ్చని నిరూపించిన గొప్ప వీరుడు నేతాజీ అని ఆయన గుర్తు చేశారు. నేటి యువత కేవలం స్మార్ట్‌ఫోన్‌లు, వినోదానికే పరిమితం కాకుండా, దేశ రక్షణ మరియు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వెంకటేష్ ఆకాంక్షించారు. నేతాజీ స్థాపించిన 'ఆజాద్ హింద్ ఫౌజ్' స్ఫూర్తితో యువత క్రమశిక్షణ, ధైర్యం మరియు దేశభక్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. హైదర్‌గూడలో తాము నిర్వహించిన ఈ 2కే రన్ కేవలం ఒక పరుగు కాదని, అది నేతాజీ ఆశయాల వైపు యువత వేస్తున్న అడుగని ఆయన వ్యాఖ్యానించారు. తమ అసోసియేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సుల్గే వెంకటేష్ స్పష్టం చేశారు. "మా అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సులు, నిరుపేదలకు సాయం మరియు సామాజిక స్పృహ కల్పించే కార్యక్రమాలు చేపడతాం. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి. ఈ రోజు ఇంత పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చి 2ఖ రన్ విజయవంతం చేయడం చూస్తుంటే, నేతాజీ పట్ల ప్రజల్లో ఉన్న గౌరవం స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. చివరగా, ఈ కార్యక్రమానికి సహకరించిన కార్పొరేటర్ గారికి, రాజకీయ నాయకులకు మరియు ప్రతి ఒక్క సభ్యునికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కొలను సుభాష్ రెడ్డి, వై. శ్రీధర్, ఎన్. మల్లారెడ్డి, ఎం. కొమురయ్య, జయానంద్ రెడ్డి, చెట్టిగారి నరేందర్, ప్రణవభక్త సమాజం అధ్యక్షులు మొంద్ర నరసింహ, సామాజిక కార్యకర్తలు మేడం మధు, సహదేవ రెడ్డి, రమేష్, కె. సుధాకర్ రెడ్డి, వరదరాజు రెడ్డి, సోమారం రవి, సోమారం రాజ్ కుమార్, మహేందర్, ఐలయ్య, అశోక్, విజయ్, జగన్, హరినాథ్, నేతాజీ యువజన సంఘం నాయకులు రాజేందర్, ధనంజయ, హనుమంత్ రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్, అజయ్, గౌతమ్, బాలకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా చిన్న మేడారం జాతర కొనసాగాలి

## ● యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్



ఇది కద నిజం, రాజాపేట:లక్షలాది మంది భక్తులు హాజరయ్యే రాజపేట మండలం చిన్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతర విజయవంతమయ్యేందుకు అనుబంధ శాఖల సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో చిన్న మేడారం జాతర విజయవంతం కోసం సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని సమీప జిల్లాల భక్తులు కూడా అధిక సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులు విధులను నిర్వర్తిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు అసౌకర్యాలు కలగకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వల్లపు ప్రదీప్, ఎంపీడీవో నాగవేణి, తుర్కపల్లి ఎస్సై తక్రుద్దీన్ మోట కొండూరు ఎస్సై ఆశోక్, ఎస్ ఐ ప్రకాష్, ఆర్ ఐ నరసింహులు, డాక్టర్ ఆమోస్, ఆర్టీసీ అధికారులు ఎల్లయ్య, కుర్రారం సర్పంచి బొడ్డు భాస్కర్, బూర్గుపల్లి సర్పంచి చింతల సంపత్, జాతర ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

# ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది- బీర్ల అయిలయ్య.




ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని న్యూ వివేర హోటల్ లో జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల ఎన్నికల సందర్భంగా నిర్భహించిన సన్నాహక సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు, భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇంఛార్జి సితక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సన్నాహక సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య ,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి , తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.జిల్లాలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతోందని తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, రైతులకు రైతు భరోసా, యువతకు ఉపాధి అవకాశాలు వంటి సంక్షేమ పథకాలు ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుంచి సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో ముందుకు సాగితే విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని స్పష్టం చేశారు.ఈ సమావేశం కాంగ్రెస్ పార్టీని మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం చేసే దిశగా కీలకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# మల్లెమోని గూడలో గృహ సమస్యలు పరిష్కరిస్తాం



ఇది కద నిజం: పరిగి మునిసిపాలిటీ పరిధిలోని మల్లెమోని గూడ ప్రాంతానికి సమీపంలో 16 ఎకరాలలో ఉన్న శాఖపూర్ గ్రామాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పరిగి మునిసిపాలిటీ పరిధిలోని మల్లెమోని గూడలో కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగి జనాభా రోజు రోజుకు అధికమవుతుండటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే TRR తెలిపారు. ప్రాంతానికి సమీపంలో 16 ఎకరాలలో ఉన్న శాఖపూర్ గ్రామాన్ని "రాజీవ్ గాంధీ నగర్"గా నామకరణం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.మల్లెమోని గూడలో ఒకే ఇంట్లో రెండు నుంచి మూడు కుటుంబాలు నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న అర్హులైన కుటుంబాలందరికీ రాజీవ్ గాంధీ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి,కొత్తగా ఇళ్లు నిర్మించి అందజేస్తామని హామీ ఇచ్చారు.గతంలో మీర్జాపూర్ సమీపంలో సోనియా గాంధీ నగర్, మన్నెగూడలో వైయస్సార్ నగర్, కండ్లపల్లి వద్ద రాజీవ్ గాంధీ నగర్‌లను నిర్మించి పేదలకు నివాస సౌకర్యం కల్పించినట్లు ఎమ్మెల్యే TRR గుర్తు చేశారు.

# నవాబుపేటలో ఘనంగా అయోధ్య రామమందిర వార్షికోత్సవ వేడుకలు



ఇది కద నిజం,నవాబుపేట, జనవరి 23: అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్టాపన జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా నవాబుపేట మండలంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి మండల ఉపాధ్యక్షులు ఎం. మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి మండల అధ్యక్షులు ఎస్. చంద్రకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. భగవాన్ శ్రీరామచంద్రమూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని, ధర్మబద్ధమైన జీవితాన్ని గడపాలని ఆయన పిలుపునిచ్చారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం భారతీయ సంస్కృతికి గర్వకారణమని కొనియాడారు. ఈ వేడుకల్లో బిజెపి ప్రధాన కార్యదర్శి పి. ప్రభాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీశైలం, మినపల్లికలాన్ సర్పంచ్ రమేష్, శేఖర్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులు ప్రభుత్వ సబ్సిడీలను

# సద్వినియోగం చేసుకోవాలి

## ● మినపల్లి కలాన్ సర్పంచ్ తనయుడు రమేష్




ఇది కద నిజం,నవాబుపేట్, జనవరి 23: కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సబ్సిడీ పథకాలను రైతులందరూ విధిగా వినియోగించుకోవాలని మినపల్లి కలాన్ సర్పంచ్ వెంకటమ్మ తనయుడు రమేష్ కోరారు. శుక్రవారం నాడు నవాబుపేట్ మండల కేంద్రంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందని, వాటిని అందిపుచ్చుకుని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు సబ్సిడీ ధరలకే ఛార్జింగ్ మందు కొట్టే పైపులు, పెట్రోల్ పంపులు మరియు ట్రాక్టర్లకు సంబంధించిన రోటవేటర్లను పంపిణీ చేశారు. ఆధునిక వ్యవసాయ పరికరాలను వాడటం వల్ల సాగు ఖర్చు తగ్గి, దిగుబడి పెరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ శేఖర్, వ్యవసాయ శాఖ ఏఈఓలు పాల్గొని రైతులకు పరికరాల పనితీరుపై అవగాహన కల్పించారు. అలాగే బీజేపీ మండల అధ్యక్షులు చంద్రకాంత్, పలువురు నాయకులు మరియు స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉడిత్యాల ఆటో కార్మికులకు యూనిఫామ్ పంపిణీ



ఇది కద నిజం,బాలానగర్, జనవరి 23: మండలంలోని ఉడిత్యాల గ్రామంలో ఆటో యూనియన్ కార్మికులకు గ్రామ సర్పంచ్ సక్కెర సువర్ణ శ్రీధర్ గౌడ్ ఆటో డ్రైవర్ల యూనిఫామ్ (దుస్తులను) పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్మికులకు క్రమశిక్షణ, వృత్తి పట్ల గౌరవం పెంపొందించేలా ఈ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించడం వల్ల సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, అలాగే ప్రయాణికులకు కూడా నమ్మకం కలుగుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, వారి సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడి గుట్ట శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. సర్పంచ్ మరియు నాయకుల చొరవ పట్ల ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# యాదగిరిగుట్టలో వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ



ఇది కద నిజం, యాదగిరిగుట్ట, జనవరి 23: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. వారోత్సవాల్లో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ ప్రత్యేక సేవను ఆలయ అర్చకులు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని విశేషంగా అలంకరించి, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారం గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఆలయ మాడ వీధుల్లో భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి ఊరేగింపు సాగింది. ఊరేగింపు అనంతరం అమ్మవారిని ప్రధాన ఆలయంలోని అద్దాల మండపంలో అధిష్టింపజేశారు. అక్కడ అర్చకులు వేదమంత్రాల సాక్షిగా ఊంజల్ సేవోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారు ఊయలలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అధికారులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

# లోకేష్ నాయకత్వానికి తెలంగాణలోనూ బ్రహ్మరథం



ఇది కద నిజం,యాదగిరిగుట్ట, జనవరి 23: ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు బక్కని నర్సింహులు స్వామివారిని దర్శించుకుని, లోకేష్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ప్రార్థించారు. దర్శనం అనంతరం కొండ కింద ఉన్న సన్నిధి హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బక్కని నర్సింహులు మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పునర్నిర్మాణానికి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. యువతను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, రానున్న రోజుల్లో పార్టీ పూర్వవైభవం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కుందారపు కృష్ణ చారి, ఆలేరు నియోజకవర్గ ఇంచార్జ్ రేగు బాల నర్సయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డీజే మూర్తి పాల్గొన్నారు. అలాగే ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవులు, నాయకులు నర్సింగరావు, సాయి నాగార్జున, మచ్చ నరసింహ గౌడ్, గుండా భాస్కర్, వనమాల సత్యనారాయణ, ముక్కెర్ల శ్రీశైలం తదితరులు పాల్గొని లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.